క్లుప్తంగా

ఎమ్మెల్యే ధనలక్ష్మి పర్యటన రేపు

దేవీపట్నం: మండలంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి సోమవారం మండలంలో పర్యటించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు డి.ఎ న్.పాలెం పంచాయతీలో పెద్దూరు, డి.ఎన్. పాలెం గ్రామాల్లో రక్షిత నీటి పథకాలకు శంకు స్థాపన చేయనున్నట్టు పేర్కొన్నారు. అనంతరం డి.ఎన్.పాలెం సచివాలయ పరిధిలో గడ పగడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

అడ్డతీగల: అడ్డతీగలలోని అనిగేరు రోడ్ వద్ద పార్వతీ సమేత నాగలింగేశ్వర క్షేత్రంలో వేంచేసిన వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సామిదాల రాజారమేష్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం గావించారు. వివిధ రకాల పుష్పాలతో పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాద అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు విజయ హోమం


కల్యాణ వినాయకుడు

రాంబిల్లి: పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ పంచదార్ల పుణ్యక్షేత్రంలో గల ద్విముఖ కల్యాణ వినాయకుడి సన్నిధిలో ఆదివారం విజయ హోమం నిర్వహించనున్నారు. ఏటా ఈ విజయ హోమం నిర్వహిస్తామని భగవత్ భక్తి ప్రచార ట్రస్టు ప్రతినిధి శిగిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. పదో తరగతి విద్యార్థులు ఈ విజయ హోమంలో పాల్గొనాలని కోరారు.

వీల్‌చైర్ అందజేత


మడిచర్లలో దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందజేస్తున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

రంపచడవరం: మండలంలోని మడిచర్ల పంచాయతీ గుంజు గూడెం గ్రామానికి చెందిన మానసిక దివ్యాంగురాలికి జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ కార్యదర్శి పండా రామకృష్ణ చేతుల మీదుగా వీల్ చైర్, నిత్యావసర సరకులు, దుస్తులు, ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. దివ్యాంగురాలి పరిస్థితిని చూసి ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి దృష్టికి తీసుకెళ్లి పింఛన్ త్వరగా మంజూరు చేసే విధంగా చూస్తామని హామీ ఇచ్చామన్నారు. సర్పంచ్ విజయశాంతి, ఎంపీటీసీ మంగయమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

మన్యంలో కొనసాగుతున్న వర్షాలు


అరకులోయలో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో గత వారం రోజుల నుంచి రోజు వర్షాలు కురుస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం నుంచే అరకులోయ, జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లో వర్షం కురిసింది. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు సమీప గ్రామాల్లో సాయంత్రం జల్లుల వాన కురిసింది.రోజు కురుస్తున్న వర్షాలు రబీలో వరి, కూరగాయలు,ఆకుకూరల పంటలకు మేలు చేస్తాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

హుకుంపేట: మండల కేంద్రాంతో పాటు మండలంలోని తడిగిరి, కొంతిలి, మట్టుజోరు, శోభకోట పంచాయితీల్లో భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫర స్తంభించింది. మండల కేంద్రంలో వారపు సంత కావడంతో సంతకు నిత్యావసరాలు కొనుగోలు చేసేందుకు వచ్చిన గిరిజనులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

వ్యాధుల కాలం.. జీవాలు జరభద్రం

- వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి
- పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి గౌతమ్ సూచనలు


గౌతమ్, పశు వైద్యాధికారి

డుంబ్రిగుడ: ఏజెన్సీలో ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఎండలు ప్రభావంతో మూగజీవులు ఇబ్బందులకు గురవుతున్నాయి. ప్రస్తుత కాలంలో మూగజీవాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంది. పశువులు అనారోగ్య బారిన పడితే పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. వేసవిలో పశువుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారి గౌతమ్ పలు సూచనాలు, సలహాలు అందించారు.

ఎండ నుంచి రక్షణ

పాడి పశువులను ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో మేతకు బయటకు వదలకుండా ఉదయం 9 గంటలోపు, సాయంత్రం 5 గంటల తరువాత వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మాత్రమే తీసుకెళ్లాలి. రోజులో మూడు లేదా నాలుగు పర్యాయాలు చల్లని నీటితో పశువులను కడగాలి. పశువుల పాకలో గాలి బాగా ప్రసరించేటట్లు చూడాలి. ఎతైన ప్రదేశాల్లో గడ్డిని కప్పి మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉన్న సమయాల్లో నీటిని చల్లాలి. వడగాడ్పుల ప్రభావం లేకుండా పశువుల కొబ్బాలకు గోనెలతో పరదాలు ఏర్పాటు చేయాలి. వీటిని కూడా మధ్యాహ్న సమయంలో నీటితో తడపాలి. పశువుల కొట్టాలపై భాగంలో తెలుపు రంగు పెయింట్ వేయాలి. పశువులను దూరం దూరంగా ఉంచాలి.


మేకలు, గొర్రెలు

అధిక పాల దిగుబడికి సూచనలు

నాటు జాతి పశువుల కంటే సంకర జాతి ఆవులు, గేదేలు, త్వరగా వడదెబ్బకు గురవుతాయి.వాటిని తరుచు చల్లని నీటితో తడుపుతుండాలి. ఒక్కో పశువు రోజుకి 60 లీటర్ల నీరు తాగుతుంది. వేసవిలో ఆ పరిమాణం మరింత పెరుగుతుంది. ఈ కారణంగా జీవాలకు మరింత తాగునీరు ఎల్లప్పుడు అందుబాటులో ఉంచాలి. తగినంత పచ్చిమేత వేయాలి. అత్యధిక పోషక విలువలు కలిగిన దాణాను అందించాలి. దాణాలో మినరల్ మిక్చర్ కలిపి ఇవ్వడంతో పాటు తగినంత ఉప్పు శాతం ఉండేలా చూసుకోవాలి. ఉదయం సాయంత్రం పాలు తీసే అరగంట ముందు పశువులను చల్లని నీళ్లతో కడిగితే పాల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.


పశువుకు వైద్యం అందిస్తున్న సిబ్బంది

గొర్రెలు, మేకలకు తీసుకోవాల్సిన జాగ్రతలు

వేసవిలో గొర్రెలు, మేకల కాపర్లు కూడా వాటి సంరక్షణ కోసం పలు జాగ్రతలు తీసుకోవాలి. బయట పచ్చిక బయళ్లలో ఉదయం సాయంత్రం చల్లగా ఉన్నప్పుడు మేపుతు మధ్యాహ్నం నీడలో విశ్రాంతి కల్పించాలి. చూడితో ఉన్న వాటిని ఇంటి వద్దే ఉంచి ఆహారం అందించాలి. మేక, గొర్రె పిల్లలతో సహా అన్నింటికీ నట్టల నివారణ మందులను వేయాలి.

జాగ్రతలు తప్పనిసరి

వేసవిలో మూగజీవుల పెంపకంపై జాగ్రతలు పాటిస్తే వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చు. నట్టల నివారణ మందులు ప్రతి పశువుకు వేయించేలా చర్యలు తీసుకోవాలి. వేసవిలో వ్యాధులు సంభవించకుండా ముందస్తు చర్యల్లో భాగంగా మందులు వేయించుకోవాలి. ఎటువంటి సూచనలు కావాలన్న తమకు సంప్రదించాలి.

టెన్త్ విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ


పెన్నులు, స్టేషనరీ సామగ్రితో విద్యార్థులు

రంపచోడవరం: మండలంలోని కాకవాడ ఆశ్రమ పాఠశాల, రంపచోడవరం బాలుర గరుకుల పాఠశాల, సీతపల్లి బాలికల పాఠశాల, ఇర్లపల్లి, నల్గొండ పాఠశాలల్లో 'అల్ ది బెస్ట్ టు టెన్త్ క్లాస్ స్టూడెంట్స్ ఇన్ రంపచోడవరం మండల్' కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీపీ బందం శ్రీదేవి, వైస్ ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, పండా కుమారి, వంశీ కుంజం, తుర్రం వెంకటేశ్వర్లు దొర, నర్రి పాపారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ బందం శ్రీదేవి మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులను కలిసి పలు సూచనలు అందించడంతో పాటు సొంత ఖర్చులతో పెన్నులు, పౌచ్‌లు తదితర స్టేషనరీ సామగ్రి అందజేస్తున్నామన్నారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా శ్రద్ధతో పరీక్షలు రాయలని సూచించారు. మంచి ఫలితాలు సాధించిన పాఠశాలలకు, విద్యార్థులకు ప్రోత్సాహకం అందిస్తామన్నారు. మాజీ ఎంపీపీ అరగాటి సర్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బి.శేఖర్, భాస్కర్ రెడ్డి, పి.ప్రసాద్, పి.గంగరాజు, బాలు,మంగిరెడ్డి, ధర్మరాజు, ఎంపీడీఓ కుమార్‌బాబు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఔషధ మొక్కలను పరిరక్షించాలి


సమావేశంలో చర్చిస్తున్న మూలికా వైద్యులు

అడ్డతీగల: ఆదివాసీ మూలికా వైద్యం అభివృద్ధికి కృషి చెయ్యాలని ఆదివాసీ సంప్రదాయ వనమూలికా వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెక్కా మల్లిరాజు అన్నారు. అడ్డతీగలలోని డి.భీమవరం రోడ్‌లో శనివారం లయ స్వచ్ఛంద సంస్థ అనుబంధ వనంతరం(మూలికా వైద్యశాల) భవనంలో ఆదివాసీ సంప్రదాయ వనమూలికా వైద్యుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన 60 మంది వనమూలికా వైద్యులను ఉద్దేశించి సంఘం అధ్యక్షుడు చెక్కా మల్లిరాజు పలు అంశాలపై మాట్లాడారు. మూలికా వైద్యులు ఔషద మొక్కలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ విధానం అంతరించిపోకుండా ఆదివాసీ యువతకు నేర్పించాలన్నారు. సంఘం కార్యదర్శి పండమ్మ మాట్లాడుతూ ప్రతి సంఘ సభ్యుడు సంఘం ఇచ్చే గుర్తింపుకార్డు పొందాలన్నారు. సంఘం ఏర్పాటు చేసే ఆయుర్వేద మందుల తయారీపై శిక్షణ తీసుకోవాలన్నారు. ప్రతి మూలికా వైద్యుడు రోగుల రిజిష్టర్ మెయింటైన్ చెయ్యాలన్నారు. ఆదివాసీ మూలికా వైద్యుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు జి.బుల్లియ్య మాట్లాడుతూ మందులు ఇచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, చంటి పిల్లలకు వైద్యం చేయరాదన్నారు.అత్యవసర రోగులను దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి పంపించాలన్నారు. కేవలం ప్రాథమిక వ్యాధులకు మాత్రమే చికిత్స అందించాలన్నారు. ఔషద మొక్కలు అంతరించిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో వైద్యం చేస్తున్న సంప్రదాయ మూలికా వైద్యులను ప్రభుత్వం గుర్తించి వారికి తగిన విధంగా శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో రాజవొమ్మంగి, అడ్డతీగల, వై.రామవరం, మారేడుమిల్లి, గంగవరం మండలాలకు చెందిన వనమూలికా వైద్యులు పాల్గొన్నారు.

వెంకట రమణకు ఘన నివాళి


మామిడి వెంకట రమణ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నేతలు

వీఆర్ పురం: మామిడి వెంకటరమణ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యుడు చిచ్చడి మురళి అన్నారు. గుండెపోటుతో మృతి చెందిన వెంకటరమణ మృతదేహాన్ని రేఖపల్లిలోని ఆయన స్వగృహం వద్ద సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నాయకులు ఎం.శ్రీనివాస్, ఎం.గంగులు, ఎం.మురళి, సీహెచ్.బాలు, బి.విజయలక్ష్మి, ఎం.వెంగళరావు, సీహెచ్.కాంతారావు, ఎం.రాజేష్, ఎం.నరేష్, సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేయాలని వినతి



పాడేరులో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నేతలు

సాక్షి, పాడేరు: రాష్ట్రంలోని బోయ, వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని గిరిజన సంఘాలు, పలు రాజకీయ పార్టీల నేతలు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రం పాడేరుతో పాటు పలు మండలాల్లో శనివారం నిరసన కార్యక్రమాలను నిర్వహించారు. పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులో మధ్యాహ్నం గిరిజన సంఘం రాస్తారోకో చేపట్టింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు అప్పలనర్స మాట్లాడుతూ బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడంతో గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు.గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. పెదబయలులో జరిగిన కార్యక్రమంలో బోయ, వాల్మీకీలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని కోరుతూ అఖిలపక్షం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ బొంజుబాబు, మాజీ ఎంపీపీ ఉమామహేశ్వరరావు. గిరిజన ఉద్యోగ సంఘ, అఖిలపక్ష నాయకులు సన్నిబాబు, బొంజుబాబు తదితరులు పాల్గొన్నారు. రాజవొమ్మంగిలో గిరిజన సంఘం ప్రతినిధులు రామారావు, సూరిబాబు,జగన్నాథం, సత్యనారాయణ, బాలకృష్ణ, సూరిబాబు, పాపారావు తదితరులు పాల్గొన్నారు. ఎటపాకలో గిరిజన సంఘం నాయకులు అర్జున్, సూరిబాబు, భద్రయ్య, రాము, జయమ్మ, బాలకృష్ణ, వెంకటేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

29న మండల సమావేశం

అడ్డతీగల: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 29 న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.బాపన్నదొర ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షుడు బొడ్డపాటి రాఘవ అధ్యక్షతన జరగనున్న సమావేశానికి మండల స్థాయి అధికారులు విధిగా సమగ్ర సమాచారంతో హాజరుకావాలని తెలిపారు. ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు సమావేశంలో పాల్గొని వివిధ సమస్యలపై చర్చిస్తారన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఐ దుర్గాప్రసాద్, ప్రజాప్రతినిధులు

వీఆర్ పురం: క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని ఎస్ఐ తెల్లం దుర్గాప్రసాద్ అన్నారు. రేఖపల్లి క్రీడా మైదానంలో మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. టోర్నీలో 65 జట్లు పాల్గొంటున్నాయని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేల చొప్పున గెలుపొందిన జట్లకు అందించనున్నట్టు పేర్కొన్నారు. ఎంపీపీ కారం లక్ష్మి, ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు, ఎంపీటీసీ సభ్యుడు పూనెం ప్రదీప్, సర్పంచ్‌లు పూనెం సరోజినీ, పులి సంతోష్, వెట్టి లక్ష్మి, సీపీఎం నాయకులు సత్యనారాయణ, రమేష్, నాగిరెడ్డి, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నేత్ర వైద్య శిబిరం

కొయ్యూరు: రాజేంద్రపాలెంలోని అల్లూరి కళామందిరం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రామానికి చెందిన నర్సీ కృష్ణ తెలిపారు. నర్సీపట్నానికి చెందిన వెంకటసాయి ఆప్టికల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. పేదలకు ఉచితంగా కళ్లద్దాలు, అవసరమైతే శస్త్రచికిత్సలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వెల్లివిరిసిన ఆనందం


కొయ్యూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

- వైఎస్సార్ ఆసరా నగదు జమ
- డ్వాక్రా సంఘ సభ్యుల హర్షాతిరేకాలు

కొయ్యూరు: మండల కేంద్రంలోని సచివాలయం పరిధిలో డ్వాక్రా సంఘాలకు వైఎస్సార్ ఆసరా నగదును ప్రభుత్వం జమ చేసింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న నగదుతో మహిళలు చిరు వ్యాపారాలు ప్రారంభించి, ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంతో మహిళా సాధికారత మరింత మెరుగుపడుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడవ విడత వైఎస్సార్ ఆసరా పథకానికి చెందిన సొమ్మును వ్యక్తిగత ఖాతాలకు ప్రభుత్వం జమ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు.

కూనవరం: మూడవ విడత వైఎస్సార్ ఆసరా నగదు ఖాతాలకు జమకావడంతో స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా సంఘ సభ్యులు క్షీరాభిషేకం చేశారు. సర్పంచ్ కట్టం రాజమ్మ, ఎంపీటీసీ కొమ్మాని అనంతలక్ష్మి, ఏపీఎం భాస్కర్, కొమ్మాని సునీత, వార్డు సభ్యులు, వీఓలు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని పలు సచివాలయాల్లో ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ లైవ్‌షోను డ్వాక్రా సంఘ సభ్యులు శనివారం ఆసక్తిగా తిలకించారు. రాజవొమ్మంగి, జడ్డంగి సచివాలయాల్లో జరిగిన ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు హాజరయ్యారు. జడ్డంగి సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, దాసరి నాగేశ్వరరావు, నాయకులు ఎ.కామేష్, ఎస్.రవి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వీరలక్ష్మి, వెలుగు ఏపీఎం ఆదినారాయణ హాజరయ్యారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలో 750 డ్వాక్రా సంఘాలకు మూడవ విడత ఆసరా రూ. 2,61,59,524 కోట్లు విడుదలైనట్లు ఏపీఎం ఆదినారాయణరావు తెలిపారు. ఈ సొమ్మును మండలంలోని మొత్తం 7,062 మంది డ్వాక్రా సంఘ సభ్యుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమ చేస్తుందన్నారు.


కూనవరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు


జడ్డంగి సచివాలయంలో సీఎం ప్రోగ్రాం లైవ్‌ను తిలకిస్తున్న డ్వాక్రా సంఘ సభ్యులు

అధ్వాన దారితో అవస్థలు


గూడెంకొత్తవీధి వద్ద వర్షానికి గోతులమయంగా మారిన ప్రధాన రహదారి

గూడెంకొత్తవీధి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు గూడెంకొత్తవీధి నుంచి సీలేరు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయం అయ్యింది. గూడెంకొత్తవీధి నుంచి ఆర్వీనగర్ వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిపై పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు స్పందించి రహదారిలో గోతులను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం


అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న శివప్రసాద్ తదితరులు

రాజవొమ్మంగి: మండలంలోని కొమరాపురంలో ఈనెల 18న జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన లోసుల రాజశేఖర్ కుటుంబానికి నేను సైతం చారిటబుల్ ట్రస్టు అధినేత శివప్రసాద్ శనివారం ఆర్థిక సహాయం అందజేశారు. ఏ సహాయం కావాలన్నా తనను ఫోన్ ద్వారా సంప్రదించాలని బాధిత కుటుంబాన్ని ఆయన కోరారు. రైల్వే బోర్డు మెంబర్ రామారావు, పాస్టర్ బర్నబాస్, వజ్రపు చిన్నబ్బాయి, అప్పారావు, కోషోర్ తదితరులు ఆయనతో పాటు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని కుటుంబానికి పరామర్శ

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వజ్రపు చిన్నబ్బాయి కుంటుంబాన్ని నేను సైతం చారిటబుల్ ట్రస్టు అధినేత శివప్రసాద్ శనివారం రాజవొమ్మంగిలో పరామర్శించారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ గొడ్డేటి మాధవి సందేశాన్ని వారికి చేర వేశారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రాయితీలు త్వరలో ఆ కుటుంబానికి అందేలా సహాయ సహకారం అందజేస్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి ధైర్యం చెప్పారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థల పరిశీలన


సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సీతమ్మ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో నూతన సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి శనివారం ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ పి.సత్యనారాయణ, సర్పంచ్ ఎస్.సుభాష్‌చంద్ర, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పి.మల్లికార్జున్ తదితరులు రెవెన్యూ అధికారుల సమక్షంలో స్థల పరిశీలన చేశారు. స్థానిక చెరువు సమీపంలో సుభబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలం చూసి దీనిని కేటాయించాలని అధికారులకు కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ నిధుల్లో రూ. 5లక్షలతో సులబ్ కాంప్లెక్స్‌కు-3లక్షలు, నీటి సరఫరా-2లక్షలు కేటాయించినట్టు తెలిపారు. మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మేరకు త్వరితగతిన పనులు పూర్తి చేసి సులభ్ కాంప్లెక్స్ అందుబాటులోకి తీసుకొస్తామని ఆమె చెప్పారు. నాయకులు జయదేవ్, కొండలరావు, మోహన్‌రావు, దాసు, సాధురాం తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న జీవీడబ్ల్యూవి ఇన్‌చార్జి పట్నాయక్

పాడేరు రూరల్: ఆధార్‌కార్డు తీసుకొని పదేళ్ల ఎటువంటి లావాదేవీలు జరపని వారు తప్పనిసరిగా తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేయించుకోవాలని జీవీడబ్ల్యూవి ఇన్‌చార్జి ఆర్.ఎస్.పట్నాయక్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పాడేరు డివిజన్‌లో ఉన్న గ్రామ సచివాలయాల్లోని ఆధార్ క్యాంపుల్లో పాల్గొంటున్న ఆధార్ ఆపరేటర్లు, సూపర్‌వైజర్లకు శనివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆధార్ రాష్ట్ర ట్రైనర్ గిరిధర్ చేత శిక్షణ కార్యక్రమం చేపట్టారు. పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో 3,59,580 మంది జనాభా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉన్నందున, 73 సెంట్రల్ ఆధార్ రిజిస్ట్రేషన్ కార్యక్రమం గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆధార్, జీవీడబ్ల్యూవి, ఎస్‌బీసీసీ జిల్లా కో-ఆర్డీనేటర్లు వెంకట్, సునీల్, రమేష్‌నాయుడు, ఆధార్ ఆపరేటర్లు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు


కొయ్యూరులో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు


రేఖపల్లిలో వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ దుర్గాప్రసాద్

కొయ్యూరు: రెండుసార్లు కంటే ఎక్కువగా గంజాయి కేసుల్లో పట్టుబడితే పీడీ కేసులు నమోదు చేస్తామని, వాటితో పాటు గంజాయి కేసులో ఉన్న అందరిపై సస్పెక్ట్ షీట్‌ను తెరుస్తామని సీఐ స్వామినాయుడు, మంప, కొయ్యూరు ఎస్ఐలు లోకేష్‌కుమార్, రాజారావు తెలిపారు. స్టేషన్లో శనివారం గంజాయి స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన 50 మందికి ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వారు మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా నేరమన్నారు. స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడిన వారంతా మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

వీఆర్ పురం: మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెల్లం దుర్గాప్రసాద్ అన్నారు. రేఖపల్లిలో శనివారం ఆయన మీ భద్రతే మా బాధ్యత పేరుతో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.